విద్యార్థినికి అభినందనలు



అభినందను అభినందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్

కీసర: ఇంటర్‌లో ఎంపీసీ విభాగంలో 948 మార్కులు సాధించిన దమ్మాయిగూడ మున్సిపాలిటీ 2వ వార్డులో నివాసం ఉంటున్న విద్యార్థి అభినందను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతా శ్రీకాంత్‌గౌడ్ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నత చదువుల్లో రాణించాలని అభిలాషించారు. తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కౌన్సిలర్లు నానునాయక్, సుజాతశ్రీనివాస్, బీఆర్ఎస్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, కనకయ్య, నాగపురి భాస్కర్, సందీప్, రాంబాబు తదతరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీనివాస కల్యాణోత్సవం



శ్రీనివాస కల్యాణోత్సవంలో ఆలయ చైర్మన్ గూడురు ఆంజనేయులు, వైస్ చైర్మన్ కౌకుట్ల అనంతరెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డులో నూతనంగా నిర్మించిన వేంకట మరకత చంద్రమౌళీశ్వర హనుమాన్ దేవస్థానంలో పలు దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం శ్రీనివాస కల్యాణోత్సవాన్ని వేద పండితులు కనుల పండువగా నిర్వహించారు. వివిధ కాలనీలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారి కల్యాణోత్సవంలో ఆలయ చైర్మన్ గూడూరు ఆంజనేయులుగౌడ్, ఉపాధ్యక్షుడు కౌకుట్ల అనంతరెడ్డి, కౌన్సిలర్లు సబిత, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న బూర నర్సయ్యగౌడ్



క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందిస్తున్న డాక్టర్ బూర నర్సయ్యగౌడ్

ఘట్‌కేసర్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ద్విచక్ర వాహనదారుడిని ఆస్పత్రికి తరలించి భువనగిరి మాజీ ఎంపీ, ప్రస్తుత బీజేపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ మానవత్వాన్ని చాటుకున్నాడు. శనివారం ఆయన భువనగిరి వెళ్తుండగా అవుషాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఆయన ప్రమాదం తీరుపై ఆరా తీశాడు. వెంటనే అతడికి ప్రథమ చికిత్స చేసి అంబులెన్స్‌ను పిలిపించి దగ్గరుండి ఆస్పత్రికి తరలించాడు. బిజీ షెడ్యూల్‌లోనూ ఆపదలో ఉన్న క్షతగాత్రుడికి సేవలందించిన ఆయనను పలువురు అభినందించారు.

ఈటల రాజేందర్‌ను గెలిపించాలని ప్రచారం



ఈటల రాజేందర్‌ను గెలిపించాలని ప్రచారం చేస్తున్న ప్రవీణ్‌రావు



మేడ్చల్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో అంకుషాపూర్‌లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. దేశం అభివృద్ధి చెందాలంటే మరోసారి కమలం గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో కరుణాకర్, రాంరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

మేడ్చల్: బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓటు వేయాలని కోరుతూ పట్టణంలో వివిధ కాలనీల్లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 57, 58, 59 బూత్‌ల పరిధిలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్, ఆంజనేయులు, ప్రేందాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు బకాయిలు చెల్లించాలి



పంచాయతీ కార్మికుల సమావేశం

శామీర్‌పేట్: గ్రామ పంచాయతీ కార్మికుల బకాయిలు చెల్లించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సీఐటీయూ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు కిష్టప్ప అధ్యక్షతన శామీర్‌పేట మండలం అలియాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బకాయిలు చెల్లించడంతో పాటు సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కార్మికులు నరసింహ, ఆరోగ్యం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

"మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే మేడ్చల్ నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండే రైల్వే బ్రిడ్జిల పనులతో నియోజకవర్గంలో మూడు ప్రాంతాల ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఏళ్ల తరబడి సాగుతున్న నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోతుండటంతో ఆ ప్రాంతాలకు వెళ్లే, ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగించే ప్రజలు నిత్యం ఎన్నో కష్టాలు పడుతున్నారు.
- మేడ్చల్"



మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థులకు సమస్యల స్వాగతం

మేడ్చల్ నియోజకవర్గంలో నత్తనడకన రైల్వే పనులు

మేడ్చల్, గుండ్లపోచంపల్లి, ఘట్‌కేసర్‌లలో

అసంపూర్తి బ్రిడ్జి పనులతో అవస్థలు

అభ్యర్థులూ.. ఇవీ మా సమస్యలు..

నియోజకవర్గంలోని పలు రహదారులను కలిపే లింకు రోడ్లపై రైల్వే లేన్ ఉన్న ప్రాంతంలో అండర్ పాస్ బ్రిడ్జిలు, ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టి ఏళ్లు గడుస్తున్నా వాటిని పూర్తి చేయడం లేదు. నియోజకవర్గంలోని వరంగల్ రహదారి, కరీంనగర్ రహదారులను కలిపే రోడ్డు ఘట్‌కేసర్ పట్టణంలో రైల్వే గేట్ వద్ద 2014లో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. 11 ఏళ్లుగా నిర్మాణం సాగుతూనే ఉంది. పాలకులు ఏవో సాకులు చూపుతూ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని కేవలం పిల్లర్ల దశలోనే వదిలేశారు. ఒకసారి కాంట్రాక్టర్ సమస్య, మరోసారి నిధుల సమస్య, ప్రతిసారీ ఏదో ఒక సాకు చూపుతూ పనులు మాత్రం ముందుకు సాగనీయం లేదు. వరంగల్ రహదారి నుంచి కరీంనగర్(రాజీవ్ రహదారి) వయా కీసర మీదుగా శామీర్‌పేట్ వరకు వెళ్లే రోడ్డు ఇది. ఈ రోడ్డులో ఘట్‌కేసర్ వద్ద రైల్వే గేటు ఉండటం, అసంపూర్తి బ్రిడ్జి ఉండటంతో నిత్యం వందల మంది వాహనదారులు, శామీర్‌పేట్, కీసర నుంచి ఘట్‌కేసర్‌వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఘట్‌కేసర్ మీదుగా వెళ్లే రైల్వే లేన్ దేశంలో అన్ని ప్రాంతాలను కలిపే లేన్ కావడంతో రైళ్ల రద్దీ ఆ రూట్లో ఎక్కువగా ఉండటంతో రైల్వే గేట్ వద్ద తరచూ గేటు మూస్తుండటంతో ప్రయాణికులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. టోల్ రోడ్డయిన ఔటర్ రింగు రోడ్డును ఆశ్రయించాల్సి వస్తోంది.



మేడ్చల్‌లో అసంపూర్తిగా మిగిలిన రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి

మేడ్చల్-గిర్మాపూర్ రూట్‌లో..

మేడ్చల్ పట్టణంలో గిర్మాపూర్‌కు వెళ్లే రూట్‌లో రామలింగేశ్వర ఆలయ సమీపంలో గేటు వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం ఐదేళ్ల క్రితం పనులు ప్రారంభించి పనులను సగంలోనే వదిలేశారు. మేడ్చల్ నుంచి 5 గ్రామాలకు, 10 వరకు కాలనీలకు, దుండిగల్ మండలానికి వెళ్లే రూట్ కావడంతో అసంపూర్తి బ్రిడ్జితో ఆ రూట్లో వెళ్లే వారు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఓట్ల కోసం గత ఎన్నికల సమయంలో తాత్కాలిక రూట్ తయారు చేసి వాహనాలు వచ్చి పోయే విధంగా ఏర్పాటు చేసినా అన్ని రకాల వాహనాలు వెళ్లడానికి వీలు లేకుండా పోయింది. అసంపూర్తి అండర్‌పాస్ వల్ల గ్రామాలు, కాలనీలకు వెళ్లాల్సిన వారు చుట్టూ 10 కిలో మీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తోంది.

కండ్లకోయ-గుండ్లపోచంపల్లి రూట్‌లో అంతే..

కండ్లకోయ నుంచి గుండ్లపోచంపల్లి వెళ్లే రూట్‌లో రైల్వే ట్రాక్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఈ రూట్‌లో అధికంగా మేడ్చల్ నుంచి మైసమ్మగూడకు వెళ్లే విద్యార్థులు, కళాశాల బస్సులు, గుండ్లపోచంపల్లిలోని పరిశ్రమలకు వెళ్లే కార్మికులు అధికంగా ఉన్నారు. రూట్‌ను పూర్తిగా మూసివేయడంతో అన్ని వర్గాల వారు పూర్తిగా ఇబ్బందులు పడుతూ అయోధ్య చౌరస్తా లేదా కొంపల్లి మీదుగా తిరిగి వెళ్లాల్సి వస్తోంది. మూడు నెలల క్రితం గౌడవెల్లిలో గేట్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభించి గేటు వద్ద రాకపోకలను పూర్తిగా మూసేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారో అని ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని పాలకులు..

రైల్వే పనులు అన్ని రైల్వే శాఖ ఆధీనంలో ఉండటం, రైల్వే శాఖ కేవలం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండటంతో మల్కాజిగిరి నుంచి ఎంపీలుగా ఉన్న నేతలు పట్టించుకోకపోవడంతో పనులు నత్తనడకన నడుస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. సిట్టింగ్ ఎంపీగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, గతంలో ఎంపీగా చేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి రైల్వే బ్రిడ్జిల విషయంలో పూర్తిగా అలసత్వం ప్రదర్శించడం వల్లే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా పార్లమెంట్ ఎన్నికలు జరుగుతుండటంతో ఈసారి గెలిచే ఎంపీ మేడ్చల్ నియోజకవర్గంలోని రైల్వే సమస్యలను ఢిల్లీ స్థాయిలో గట్టిగా వినిపించి పరిష్కరించాలని ఓటర్లు కోరుతున్నారు.

ప్రభుత్వాలు మారుతున్నా..



ఘట్‌కేసర్‌లో రైల్వే వంతెన పనులు పూర్తి చేయించడంలో నాయకులు విఫలమయ్యారు. గతంలో ప్రాతినిధ్యం వహించిన ఎంపీలు ఎవరూ ఈ విషయాలను పట్టించుకోలేదు. 11 ఏళ్లుగా బ్రిడ్జి నిర్మాణం కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఘట్‌కేసర్‌వాసులు కీసర వైపు వెళ్లాలంటే గంటల తరబడి గేటు వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. ఎలక్షన్ల తర్వాత నిధులు మంజూరు చేయించి వంతెన పనులను పూర్తి చేయించాలి.

- విప్పర్ల హనుమాన్, ఘట్‌కేసర్

గంటల తరబడి ప్రయాణం



మేడ్చల్ నుంచి మైసమ్మగూడకు 15 కిలో మీటర్ల దూరం ఉంది. అసంపూర్తి బ్రిడ్జిల నిర్మాణం వల్ల ద్విచక్రవాహనంపై వెళ్లే గంట సమయం పడుతుంది. కండ్లకోయ నుంచి అసంపూర్తి బ్రిడ్జి నిర్మాణం వల్ల రోడ్డు మూసివేయగా అయోధ్య చౌరస్తా నుంచి వెళ్తే భారీ వాహనాలు, ట్రాఫిక్ సమస్య కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గేటు పడితే 15 కిలో మీటర్ల ప్రయాణానికి గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.

- సూర్య, విద్యార్థి, మేడ్చల్

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి సతీమణి ప్రచారం



గౌడవెల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీమణి రజనీలక్ష్మారెడ్డి

మేడ్చల్: మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సతీమణి రజనీ లక్ష్మారెడ్డి మండలంలోని గౌడవెల్లి గ్రామంలో శనివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, శ్రీనివాస్‌రాజు, సుదర్శన్, రణదీప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు

కీసర: వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందని కీసర మండల ప్రత్యేకాధికారి జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్ అన్నారు. కీసర మండల పరిషత్ కార్యాలయంలో నీటి ఎద్దడిపై శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నీటి సమస్యలు ఎదురైతే స్థానికంగా ఉన్న రైతులకు చెందిన బోరు బావుల నుంచి నీటిని సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకోసం రైతులతో మాట్లాడాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. ఇప్పటి వరకు కీసర మండలంలోని గ్రామాల్లో నీటి సమస్యలు లేవని గ్రామకార్యదర్శులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటయ్య, మిషన్ భగీరథ ఈఈ జ్యోతి, ఎంపీడీఓ గ్యామ, ఏఈ రవళి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గేదెలను క్రూరంగా తరలిస్తున్న వ్యక్తిపై కేసు



కంటైనర్‌లో గేదెలు, దున్నలు

ఘట్‌కేసర్: క్రూరంగా గేదెల తరలిస్తున్న వాహనాన్ని ఘట్‌కేసర్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కరపోతుల సత్యనారాయణ(50)అనే వ్యక్తి నవపేట్ సంతలో 46 గేదెలు, దున్నలు కొనుగోలు చేసి ఓ కంటైనర్‌లో తాళ్లతో బంధించి ఏపీ అనంతపురం జిల్లా మైదుకూరుకు క్రూరంగా తరలిస్తుండగా పట్టణంలోని యంనంపేట్ చౌరస్తాలో శనివారం పట్టుకున్నారు. వాహనంలోని గేదెలు, దున్నలను జియాగూడలోని గోశాలకు తరలించారు. వాహనం డ్రైవర్, నిందితుడు సత్యనారాయణను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి



సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా జిల్లాలోని నోడల్, పోలీసు అధికారులు తమకు కేటాయించిన విధులను సమన్వయంతో నిర్వహించాలని జనరల్ అబ్జర్వర్ డాక్టర్ ఎం.ఎస్.ప్రియాంక శుక్లా అన్నారు. కలెక్టరేట్ వీసీ హాల్‌లో శనివారం జరిగిన సమావేశంలో పోలీస్ అబ్జర్వర్ డాక్టర్ రామేశ్వర్‌సింగ్, వ్యయ పరిశీలకులు మనోజ్ అలోయిస్ లక్రా, ధృవ్ భోళా, జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ కలిసి ఎన్నికల పోలింగ్ సరళిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆమె వివరించారు. స్వేచ్ఛ, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 37,79,596 ఓటర్లు ఉన్నారని, ఫ్లైయింగ్ స్క్వాడ్ టీములు 24/7 పర్యవేక్షణ చేస్తుంటారని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు అభ్యర్థులు చేసే ప్రతి ఖర్చును ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సరిహద్దు చెక్ పోస్టులలో పూర్తి నిఘాతో నిరంతరం తనిఖీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అభిలాష్ అభినవ్, డీసీపీలు నిఖిత పంత్, పద్మ, జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, రాజేశ్వర్‌రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సజావుగా రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియ



సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ సిబ్బందికి సంబంధించి రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ ఎంఎస్ ప్రియాంక శుక్లా పర్యవేక్షణలో శనివారం కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారి గౌతమ్ చేపట్టారు. ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ సిబ్బందికి సంబంధించిన రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను సజావుగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ మాట్లాడుతూ మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 2,425 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 12,230 మంది సిబ్బందిని రెండో విడత ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేశామన్నారు. 2,425 పోలింగ్ కేంద్రాలకు పారదర్శకంగా ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. ఐదు నియోజకవర్గాలకు 2,861 టీమ్‌లు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు అభిషేక్ అగస్త్య, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, డీఈఓ విజయకుమారి అధికారులు పాల్గొన్నారు.

చనిపోతున్నానని భార్యకు ఫోన్‌లో చెప్పి..



కుమార్ మృతదేహం వద్ద రోధిస్తున్న భార్య మంజుల

శామీర్‌పేట్: మద్యానికి బానిసైన వ్యక్తి చనిపోతున్నానని భార్యకు ఫోన్ చేసి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ మారేడ్‌పల్లికి చెందిన బత్తుల కుమార్(45) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన కుమార్ నిత్యం మద్యం తాగి భార్యకు మలుమార్లు ఫోన్ చేసి చనిపోతానని చెప్పేవాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం కూడా ఫోన్ చేసి బొల్లారం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నానని భార్య మంజులకు ఫోన్ చేసి చెప్పాడు. అక్కడికి వెళ్లి చూడగా ఆచూకీ లభించకపోవడంతో శామీర్‌పేట చెరువు వద్దకు వచ్చి చూడగా చెప్పులు, సెల్‌ఫోన్ లభ్యమయ్యాయి. దీంతో చెరువు పరిసర ప్రాంతాల్లో వెతుకుతుండగా చెరువులో కుమార్ మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మహేష్ యాదవ్ మృతదేహం

కీసర: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం కీసర మండలం చీర్యాలలో చోటుచేసుకుంది. కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం అన్నంపట్ల గ్రామానికి చెందిన పర్వతం మహేష్‌యాదవ్(38)కు 12 ఏళ్ల క్రితం కీసర శివాజీనగర్‌కాలనీకి చెందిన భవానీతో వివాహమైంది. వీరికి కూతురు(9), కొడుకు(7) ఉన్నారు. భూమి విక్రయించగా వచ్చిన డబ్బులతో మహేష్‌యాదవ్ సొంతూర్లో ఇల్లు నిర్మిస్తున్నాడు. ఇంటి నిర్మాణానికి పెట్టిన ఖర్చులో తేడాలు రావడంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆయన మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో భవాని కీసరలోని శివాజీనగర్‌కాలనీలో ఉంటున్న తన తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. మహేష్ తన భార్య కోసం శుక్రవారం కీసరకు వచ్చారు. మళ్లీ అక్కడ గొడవ జరిగింది. చీర్యాలకు చెందిన తోడళ్లుడు వెంకటేష్, యాప్రాల్‌కు చెందిన మరో వ్యక్తి మహేష్‌ను చీర్యాలలోని వ్యవసాయ పొలానికి తీసుకెళ్లారు. అక్కడ అందరూ కలిసి మద్యం తాగారు. మద్యం మత్తులో ఉన్న మహేష్ వ్యవసాయ పొలంలోని షెడ్‌లో ఉరి వేసుకుంటున్నట్లు బామ్మర్దికి వీడియో కాల్ చేశాడు. కుటుంబ సభ్యులు వచ్చేలోగా షెడ్‌లో వేలాడుతూ అపస్మారక స్థితిలో ఉన్న అతడిని నగరంలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మహేష్ మృతి పట్ల అతడి సోదరులు పాండు, రమేష్ అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి సోదరుల ఫిర్యాదు మేరకు కీసర పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రణాళికతో చదివితేనే ఫలితం

బోడుప్పల్: విద్యార్థులు ప్రణాళికతో చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. బోడుప్పల్ బృందావన్ కాలనీలో శనివారం జేజీఆర్ ఉన్నత పాఠశాల 2023-24 సంవత్సర వార్షిక ఫలితాలను వెల్లడించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణ, అంకిత భావం, విలువలతో కూడిన విద్యతో పాటు అన్ని రకాల క్రీడల్లో ప్రోత్సహిస్తున్నామని వివరించారు. విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని వెల్లడించారు. పాఠశాల ఇన్‌చార్జి విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

6 గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

● మాజీ మంత్రి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ● రాష్ట్రంలో 10 నుంచి 11 ఎంపీలను బీఆర్ఎస్ గెలుస్తుంది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



జగ్గంగూడలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తరాలు రాస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, రైతులు

కీసర: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నాగారం మున్సిపాలిటీ, కీసరలో శనివారం పార్టీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్నారు. అనంతరం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో పైసల్ ఇచ్చే పథకాలను అమలు చేయడం లేదని, పైసల్ ఇవ్వని ఉచిత బస్సు వంటి ఒకట్రెండు పథకాలను అమలు చేసి చేతులు ఎత్తేసిందన్నారు. ఇక బీజేపీ ప్రభుత్వం 10 ఏళ్ల కాలంలో ప్రజలను మోసం చేస్తోందన్నారు. నాలుగు నెలల్లోనే ప్రజలందరూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను అర్థం చేసుకున్నారని, నమ్మకం, భరోసా అంటే బీఆర్ఎస్, కేసీఆర్ కేటీఆర్ అని ప్రజలు నమ్ముతున్నారని ఈ సారి రాష్ట్రంలో 10 నుంచి 11 ఎంపీ సీట్లు గెలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నేత చామకూర డాక్టర్ భద్రారెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్, కౌకుట్ల తిరుపతిరెడ్డి, జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఆర్.ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఈటలతో మాటలు సోషల్ మీడియాలో వైరల్‌పై..

బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌తో సరదాగా ఈటల గెలుపు గురించి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంపై శనివారం నాగారం మున్సిపాలిటీలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మల్లారెడ్డి స్పందించారు. తాను సోషల్ మీడియా మోస్ట్ పాపులర్ అయ్యానని, ఏమి మాట్లాడినా సోషల్ మీడియాలో వైరల్ అవుతోందన్నారు. తాజాగా శుక్రవారం కండ్లకోయలో ఓ శుభకార్యానికి హాజరైన తాను అక్కడి వచ్చిన తన పాతమిత్రుడు, నాతోటి మంత్రిగా పనిచేసిన వ్యక్తి బీఆర్ఎస్‌లో 20 ఏళ్లు ఉన్న వ్యక్తి, కేసీఆర్‌తో పెద్దగా ఎదిగిన వ్యక్తి, అంతకుముందు ఏమీ లేని వ్యక్తి కోడిగుడ్లు అమ్ముకునే వ్యక్తి కేసీఆర్, బీఆర్ఎస్‌ను మోసం చేసిన ఈటల రాజేందర్ కలిస్తే ఆప్యాయంగా పలకరించినా ఆలింగనం చేసుకున్నా.. ఆల్ ది బెస్ట్ అన్న, గాడ్ బ్లెస్ అన్న, నువ్వే గెలుస్తున్నవు అన్నాను తప్పేముంది, స్పోర్టీగా అంటాము కదా..? దాన్ని సోషల్‌మీడియాలో పెట్టి వైరల్ చేస్తున్నారన్నారు. ఈటల రాజేందర్ ఇక్కడి లోకల్ కాదని, ఆయనకు క్యాడర్ లేదు, లీడర్లు లేరు, ఓటర్లు లేరని మల్కాజ్‌గిరి ఎంపీ స్థానాన్ని బీఆర్ఎస్ గెలుపొందడం ఖాయం అన్నారు.

రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

శామీర్‌పేట్: రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మేడ్చల్ ఎమ్మెల్యే, మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డి అన్నారు. మద్దతు ధర రూ.500 బోనస్‌తో పాటు రైతు సమస్యలను పరిష్కరించాలంటూ శనివారం మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడ గ్రామంలోని రైతులు రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తరాలు రాశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్లారెడ్డితో పాటు ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డిలు పాల్గొన్నారు.